సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 22 । జూన్ । 2025

మ్యాట్ల కోసం కొట్లాట.. టాయిలెట్ల కోసం తోపులాట

- యోగాంధ్రలో ప్రజలు అవస్థలు
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 3.03 లక్షలకు పైగా జనసమీకరణ
- సగం మందికే యోగా మ్యాట్లు.. అల్పాహారం కిట్లు..
- యోగాసనాల తర్వాత బస్సుల కోసం కిలోమీటర్లు నడక


తెన్నేటి పార్కు వద్ద మ్యాట్ల కోసం తోపులాట


కాలకృత్యాల కోసం విద్యార్థుల పాట్లు

విశాఖ సిటీ: యోగాంధ్ర కార్యక్రమం ప్రజల సహనానికి పరీక్ష పెట్టింది. యోగాభ్యాసకులకు సైతం ముచ్చెమటలు పట్టించింది. అర్ధరాత్రి ప్రజలను తరలించడం.. అందుబాటులో టాయిలెట్లు ఏర్పాటు చేయకపోవడం.. యోగాసనాల తర్వాత బస్సుల కోసం కిలోమీటర్ల మేర నడిపించడంతో విసిగెత్తిపోయారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విద్యార్థులకు అర్ధరాత్రి 12 గంటలకే రుషికొండకు తరలించారు. దీంతో వారు రోడ్ల మీదే నిద్రపోయారు. అలాగే తరలించిన వారిని నిర్దేశిత కంపార్ట్‌మెంట్ల వద్దే దించి.. తిరిగి అక్కడే ఎక్కించుకుని ఇళ్లకు తరలిస్తామని చెప్పిన ప్రభుత్వం.. కార్యక్రమం ముగిసిన తర్వాత పట్టించుకోలేదు. యోగాంధ్ర వేదికకు తరలించడానికి పెట్టిన శ్రద్ధ.. తిరిగి వారిని తీసుకెళ్లే విషయంపై పెట్టలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యోగాంధ్రకు వచ్చిన 3.03 లక్షలకు పైగా జనాలు కూటమి ప్రభుత్వంపై పెదవి విరిచారు.

టాయిలెట్ల కోసం అవస్థలు

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రజలను యోగాంధ్ర వేదికకు పెద్ద ఎత్తున తరలించారు. అర్ధరాత్రి 2 గంటలకే ప్రత్యేక బస్సుల్లో లక్షల మంది జనాలను నిర్దేశిత కాంపార్ట్‌మెంట్ల వద్దకు తీసుకొచ్చారు. వీరిలో అత్యధిక శాతం మహిళలే ఉన్నారు. డ్వాక్రా మహిళలు తప్పనిసరిగా యోగాంధ్ర కార్యక్రమానికి హాజరుకావాలని హెచ్చరించడంతో మెజార్టీ మహిళలు తప్పనిసరి పరిస్థితుల్లో తరలివచ్చారు. అయితే ఉదయం కాలకృత్యాలు తీర్చుకోడానికి మాత్రం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతి వంద మందికి ఒక టాయిలెట్ ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జోడుగుళ్లపాలెం నుంచి భీమిలి వరకు వేసిన కంపార్ట్‌మెంట్లకు దూరంగా టాయిలెట్లు ఏర్పాటు చేశారు. కొన్ని చోట ఏకంగా అర కిలోమీటరు దూరంగా బయో టాయిలెట్లను ఉంచారు. దీంతో కాంపార్ట్‌మెంట్ల నుంచి ప్రజలు అక్కడికి వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. అక్కడ కూడా పెద్ద క్యూలు ఉండడంతో ఎటు వెళ్లాలో తెలియక నరకయాతన అనుభవించారు. కొన్ని చోట్ల టాయిలెట్లకు వెళుతున్న వారిని పోలీసులు అడ్డుకోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ బయో టాయిలెట్లను సైతం శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం భరించలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

మ్యాట్ల కోసం కొట్లాట

ఒకవైపు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు వేస్తుంటే.. మరోవైపు యోగా మ్యాట్ల కోసం కొందరు ముష్టి యుద్ధాలు చేసుకున్నారు. స్నాక్ ప్యాకెట్ల కోసం దుస్తులు చింపుకున్నారు. ఆర్‌కే బీచ్ నుంచి పార్క్ హోటల్ వరకు యోగాసన కార్యక్రమం సజావుగా జరిగింది. ఎంవీపీ కాలనీ నుంచి భీమిలి వరకు, అలాగే పీఎం పాలెం, మిథిలాపురి వుడా కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో తోపులాటలు, కొట్లాటలు జరిగాయి. ఈ యోగాసనాలకు వచ్చే 5 లక్షల మందికి ఉచితంగా యోగా మ్యాట్లు, టీషర్ట్, స్నాక్స్, పళ్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సగం మందికి కూడా వీటిని అందించలేదు. వీఐపీలు, అధికారులు యోగాసనాలు వేసే ప్రాంతాల్లో మ్యాట్లు, స్నాక్ ప్యాకెట్లు కంపార్ట్‌మెంట్లలోనే అందుబాటులో ఉంచారు. కానీ కొన్ని ప్రాంతాల్లో మాత్రం వాటిని అందించలేదు. పీఎం పాలెం డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో వాటర్ బాటిళ్లు, యోగా మ్యాట్లు, స్నాక్స్ కోసం జనాలు ఎగబడ్డారు. ఈ క్రమంలో తోపులాటలు జరిగి కొట్లాటకు దిగారు. ఇందులో గాజువాకకు చెందిన కూటమి నాయకుడు కారులో వచ్చి పోలీసుల సాయంతో జనాన్ని పక్కకు నెట్టి స్నాక్స్, యోగా మ్యాట్ల బస్తాలను బలవంతంగా కారులో ఎక్కించుకుని ఉడాయించాడు. దీనిపై అక్కడున్న వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తిమ్మాపురంలో స్నాక్ ప్యాకెట్ల కోసం, చేపలుప్పాడలో టీషార్టుల కోసం తోపులాటలు జరిగాయి.

కిలోమీటర్లు నడక

యోగాసనాలు ముగిసిన తర్వాత ప్రజలందరూ ఒకేసారి బయలుదేరారు. కాంపార్ట్‌మెంట్ల వద్ద దించిన బస్సులను ఒకటి, రెండు కిలోమీటర్ల దూరంగా నిలిపారు. అవి బీచ్ రోడ్డులోకి వచ్చే పరిస్థితి లేదని, అందరూ ఆ బస్ పాయింట్ల వద్దకు రావాలని సూచించారు. దీంతో యోగాకు వచ్చిన వారు కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది. ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి నిద్రలేక, కాలకృత్యాలు తీర్చుకునే అవకాశం లేక విసిగెత్తిపోయారు. దీనికి తోడు కిలోమీటర్లు నడవాల్సి రావడంతో ప్రభుత్వంపై మండిపడ్డారు. బలవంతంగా తీసుకురావడమే కాకుండా అవస్థలకు గురిచేయడాన్ని తప్పుబట్టారు.




సాగరతీరంలో యోగాసనాలు వేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు

రికార్డు యోగా

యోగాంధ్రకు రెండు గిన్నిస్ రికార్డులు

- పాల్గొన్న పీఎం మోదీ, గవర్నర్, సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- 25 వేల గిరిజన విద్యార్థుల సూర్య నమస్కారాలు
- 3 లక్షలకు పైగా ప్రజలు యోగాసనాలతో సూరత్ రికార్డు బ్రేక్

విశాఖ సిటీ: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం విశాఖలో ఘనంగా నిర్వహించారు. అట్టహాసంగా 'యోగా ఫర్ వన్ ఎర్త్–ఎన్ హెల్త్' నినాదంతో చేపట్టిన యోగాంధ్ర వేడుకల్లో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఎం యోగా విశిష్టతలపై ప్రసంగించారు. అనంతరం 3.03 లక్షల మంది ప్రజలతో కలిసి 45 నిమిషాల పాటు యోగాసనాలు వేశారు.

రెండు గిన్నిస్ రికార్డులు సొంతం

ఈ యోగాంధ్ర కార్యక్రమం ద్వారా రెండు గిన్నిస్ రికార్డులు సొంతమయ్యాయి. శుక్రవారం సాయంత్రం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో 25 వేల మంది గిరిజన విద్యార్థులు యోగాసనాలు వేశారు. 108 నిమిషాల పాటు 108 సూర్య నమస్కారాలు చేసి రికార్డు సృష్టించారు. అలాగే శనివారం ఉదయం ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన 326 కంపార్ట్‌మెంట్లకు 3.03 లక్షల మంది జనాలు వచ్చారు. ఏకకాలంలో సామూహిక యోగాసనాలు వేసినందుకు గాను మరో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సొంతమైంది. గతంలో సూరత్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో 1.47 లక్షల మంది పాల్గొనగా.. విశాఖ జరిగిన కార్యక్రమానికి 3.03 లక్షల మంది ప్రజలు భాగస్వాములయ్యారు. ఈ రెండు గిన్నిస్ రికార్డు ధ్రువపత్రాలను మంత్రులు లోకేష్, సత్యకుమార్‌లకు అందజేశారు.

యుద్ధ నౌకల్లో నేవీ సిబ్బంది విన్యాసాలు

ఈ యోగాంధ్ర కార్యక్రమంలో తూర్పు నావికాదళం కూడా భాగస్వామ్యమైంది. ఈఎన్‌సీకి చెందిన 11 యుద్ధనౌకలను శనివారం ఉదయం సాగర తీరంలో మోహరించారు. అందులో నేవీ అధికారులు, సిబ్బంది కూడా యోగాభ్యాసాలు చేశారు. వీరితో పాటు 11 వేల మంది నేవీ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు శనివారం ఆర్‌కే బీచ్ నుంచి పార్క్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన వేదికల్లో కూడా యోగాసనాలు వేశారు.


తీరంలో నగరవాసుల యోగాసనాలు

ఊపిరిపీల్చుకున్న అధికారులు

యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు కొన్ని నెలలుగా శ్రమిస్తున్నాయి. జిల్లాలో అన్ని శాఖల అధికారులు సమన్వయంగా అహర్నిశలు కష్టపడ్డారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 5 లక్షల మందిని తరలించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని ఇచ్చింది. అందుకు తగ్గట్లుగానే అధికారులు ప్రయత్నాలు చేశారు. అయితే లక్ష్యానికి చేరుకోలేకపోయినప్పటికీ.. 3.03 లక్షల మందిని తీసుకువచ్చి గిన్నిస్ రికార్డు సొంతమయ్యేలా చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, గవర్నర్, సీఎం, ఇతర ప్రముఖులు హాజరవడంతో ఒకవైపు వారి భద్రత, వసతితో పాటు మరోవైపు జనాల తరలింపు, వారికి ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. లోటుపాట్లు ఉన్నప్పటికీ.. యోగాంధ్ర కార్యక్రమం ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ఏయూ గ్రౌండ్ దిక్కయింది..

యోగాంధ్రలో గిన్నిస్ రికార్డుకు వేదికైన ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ గ్రౌండ్‌ను అభివృద్ధి చేశారు. ఆ సమయంలో అస్తవ్యస్తంగా ఉన్న గ్రౌండ్‌లో గ్రావెల్ వేసి ఎత్తు పెంచారు. అలాగే దాని ఎదురుగా దశాబ్దాలుగా తుప్పలు, పిచ్చి మొక్కలతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ప్రాంతాన్ని సైతం చదును చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆ సమయంలో కూటమి నేతలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఏయూ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని తప్పుడు ప్రకటనలు చేశారు. ఇప్పుడు 25 వేల మంది గిరిజన విద్యార్థులు యోగాసనాలకు వేదికైంది. గిన్నిస్ రికార్డును చేరువ చేసేందుకు పరోక్షంగా కారణమైంది.


నౌకపై నేవీ సిబ్బంది యోగాసనాలు

తిండి లేదు.. నిద్ర లేదు

- యోగాంధ్రలో గిరిజన విద్యార్థుల అష్టకష్టాలు
- వసతి లేక ఇబ్బందులు.. గ్రౌండ్, బస్సుల్లోనే విద్యార్థుల నిద్ర
- బురదలోనే భోజనాలు, తాగునీటి కోసం పాట్లు
- 5 వేల మందికి 10 టాయిలెట్లు.. కంపుతో అల్లాడిన చిన్నారులు
- అర్ధాకలి.. నిద్రలేక నీరసించినా గిన్నిస్ రికార్డు కొట్టిన విద్యార్థులు


ఆకలి, నిద్రలేమితో పడిపోయిన విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యుడు



విశాఖ సిటీ: యోగాంధ్ర పేరుతో కూటమి ప్రభుత్వం అభం శుభం తెలియని గిరిజన విద్యార్థులను అష్టకష్టాలు పెట్టింది. గిన్నిస్ రికార్డు పేరుతో అల్లూరి జిల్లా నుంచి వేల మంది చిన్నారులను నగరానికి తీసుకొచ్చి సరైన వసతి కల్పించకుండా నరకం చూపించింది. సక్రమంగా భోజనం పెట్టకుండా.. నిద్రపోవడానికి వసతి ఏర్పాటు చేయకుండా రోడ్డు పాలు చేసింది. విద్యార్థులు అర్ధాకలితో అలమటించారు. భోజనాల వద్ద తోపులాటల్లో నలిగిపోయారు. బురదలోనే భోజనాలు, టిఫిన్లు చేశారు. టాయిలెట్ల కోసం క్యూ కట్టారు. కంపు భరించలేక అవస్థలు పడ్డారు. తాగునీటి కోసం ట్యాంక్ వద్ద ఎగబడ్డారు. అపరిశుభ్రమైన నీటితోనే గొంతులు తడుపుకున్నారు. యోగాసనాలు వేసేంత వరకు ఎండలోనే పడిగాపులు కాశారు. రాత్రి గ్రౌండ్, బస్సుల్లోనే నిద్రించారు. కూటమి ప్రభుత్వం సరైన వసతి సౌకర్యాలు కల్పించకపోయినప్పటికీ.. సగం నిండిన కడుపులతో.. ఎండ వేడికి గొంతెండుతున్నా.. నిద్ర లేక నీరసించినా.. 25 వేల మంది విద్యార్థులు 108 నిమిషాల పాటు 108 సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డును సాధించారు.

విద్యార్థుల హాహాకారాలు

అల్లూరి జిల్లా నుంచి 25 వేల మంది గిరిజన విద్యార్థులతో యోగాసనాలు చేయించి రికార్డు సాధించాలని కూటమి ప్రభుత్వం భావించింది. ఇందుకోసం గురువారం రాత్రికే కొంత మంది గిరిజనులను ఇక్కడకు తీసుకువచ్చింది. కానీ రాత్రి వసతి ఏర్పాట్లు చేయలేదు. సక్రమంగా భోజనాలు అందించలేదు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా అర్ధాకలితోనే ఉన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలోనే ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతూ నిద్రపోయారు. మరుసటి రోజు శుక్రవారం తెల్లవారుజామున మరి కొంత మంది విద్యార్థులను అల్లూరి జిల్లా నుంచి నగరానికి తీసుకొచ్చారు. వీరికి కూడా మధ్యాహ్నం సక్రమంగా భోజన ఏర్పాట్లు చేయలేదు. 25 వేల మంది పిల్లలను తీసుకొచ్చి ఎండలోనే ఐదు కౌంటర్లలో భోజనాలు వడ్డించారు. దీంతో విద్యార్థులు గంటల తరబడి క్యూలైన్లలో ఉండాల్సి వచ్చింది. రోడ్డు మీదే భోజనాలు చేశారు. అనంతరం చేతులు కడుక్కోడానికి మంచినీటికి కూడా లైన్లలో నిలబడాల్సి వచ్చింది.



బురదలోనే భోజనాలు.. కంపుకొట్టిన టాయిలెట్లు

శనివారం ఉదయం పరిస్థితి మరింత దారుణంగా మారింది. 5 వేల మందికి వేసిన ఒక్కో టెంట్‌కు కేవలం 10 తాత్కాలిక టాయిలెట్లు మాత్రమే ఏర్పాటు చేశారు. ఇలా మొత్తం 25 వేల మందికి టెంట్లు వేశారు. దీంతో ఉదయం చిన్నారులు కాలకృత్యాలు తీర్చుకోడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ టాయిలెట్లను శుభ్రం చేసే వారు లేక తీవ్ర దుర్గంధం వెదజల్లింది. అయినప్పటికీ మరో దారి లేక ముక్కు మూసుకుంటూనే వెళ్లాల్సి వచ్చింది. అలాగే దాని పక్కనే టిఫిన్లు ఏర్పాటు చేశారు. బాత్‌రూమ్‌ల నుంచి వచ్చిన నీటితో బురదమయంగా మారిన గ్రౌండ్‌లోనే చిన్నారులు అల్పాహారం తిన్నారు. విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందించకుండా వాటర్ ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేశారు. తీసుకొచ్చిన వాటర్ కంటైనర్లు నిమిషాల్లోనే ఖాళీ అవడంతో చిన్నారులు వాటర్ ట్యాంకర్ వద్ద, డ్రమ్ముల్లో అడుగంటిన అపరిశుభ్రమైన నీటిని తాగారు.

మైదానం.. బస్సుల్లోనే నిద్ర





అల్లూరి జిల్లా నుంచి 25 వేల మందిని గిరిజన విద్యార్థులను తీసుకువచ్చిన కూటమి ప్రభుత్వం వారికి సరైన వసతి సౌకర్యాలు కల్పించడంలో విఫలమైంది. వీరికి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, విశాఖ వ్యాలీ స్కూల్, పెందుర్తి ప్రాంతంలోని ఒక కల్యాణ మండలంలో శుక్రవారం రాత్రి వసతికి ఏర్పాట్లు చేశారు. 25 వేల మందికి అది సరిపోకపోవడంతో చాలా మంది విద్యార్థులను ఏయూ ఇంజనీరింగ్ కాలే జ్ గ్రౌండ్‌లోనే వదిలేశారు. దీంతో విద్యార్థులు గ్రౌండ్‌లోను, బస్సుల్లోనే ఇబ్బందులు పడుతూ పడుకున్నారు. అలాగే వసతి ఏర్పాట్లు చేసిన వారికి కూడా రాత్రి 10 గంటలకు తీసుకువెళ్లి మళ్లీ ఉదయం 3 గంటలకే సిద్ధం ఉండాలని ఆదేశించారు. తెల్లవారుజామునే అక్కడి నుంచి ఏయూ గ్రౌండ్‌కు తీసుకువచ్చారు. శనివారం తెల్లవారకముందే మళ్లీ వారు యోగాసనాలకు సిద్ధమయ్యారు. దీంతో వీరికి సరైన భోజనం, నిద్ర లేక నీరసించిపోయారు. ఉదయం 8 గంటలకు యోగాసనాల తర్వాత కూడా టిఫిన్లు అందించలేదు. కొంత మంది వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థలకు టిఫిన్ పంపిణీ బాధ్యతలు అప్పజెప్పడం, వేల సంఖ్యలో విద్యార్థులు ఉండడంతో తోపులాట జరిగే అవకాశం ఉంటుందని భయపడి అనేక మంది విద్యార్థులు టిఫిన్ల కోసం వెళ్లలేదు.

కలెక్టర్‌కు ముఖ్యమంత్రి ప్రశంస



మహారాణిపేట: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. కలెక్టర్ కృషి, ప్రణాళికను విలేకరుల సమావేశంలో సీఎం ప్రస్తావించారు. అంతర్జాతీయ స్థాయి కార్యక్రమ నిర్వహణలో అధికార యంత్రాంగం కీలక పాత్ర పోషించిందని, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు.

హైవేపై జామ్

స్తంభించిన ప్రజా రవాణా

ప్రయాణికులకు అవస్థలు 8లో



వైఎస్ జగన్‌పై టీడీపీ కుట్ర

- ఇందులో భాగంగానే గోరంట్ల వ్యాఖ్యలు
- ఆయన్ని వెంటనే అరెస్ట్ చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు డిమాండ్



మద్దిలపాలెం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని, ఆయనపై కుట్రలకు పాల్పడటమే ఏకైక అజెండాగా టీడీపీ పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆరోపించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ తల నరుకుతామంటూ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేసిన వ్యాఖ్యలు అధికార మదంతో అన్నవి కావని.. అది ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతున్న కుట్రలో భాగమేనని రాజు ఆరోపించారు. 'పుష్ప-2' సినిమా డైలాగ్‌తో ఫ్లెక్సీ వివాదాన్ని సృష్టించడం, ఆ వెంటనే గోరంట్ల చేత ఈ వ్యాఖ్యలు చేయించడం టీడీపీ, ఎల్లో మీడియా వేసిన పథకమని విమర్శించారు. బుచ్చయ్య చౌదరిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే..

ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే టీడీపీ ఇలాంటి డైవర్షన్, క్రిమినల్ రాజకీయాలకు పాల్పడుతోందని రాజు ఆరోపించారు. 'ప్రశ్నిస్తే భూస్థాపితం చేస్తా, రెడ్ బుక్ అంటూ చంద్రబాబు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ముందు ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు?' అని ప్రశ్నించారు. ఏడాదిలోనే ఒక ప్రభుత్వం మీద ఇంత తీవ్రమైన వ్యతిరేకత రావడం.. దేశ చరిత్రలోనే కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. సూపర్ సిక్స్, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆడబిడ్డ నిధి, ఉచిత పంటల బీమా వంటి హామీలను గాలికొదిలేశారని విమర్శించారు.

దిగజారిన శాంతిభద్రతలు

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఇసుక, మట్టి, లిక్కర్ మాఫియాలు పెచ్చుమీరాయని కె.కె.రాజు ఆరోపించారు. 390 మంది హత్యకు గురయ్యారని, 376 మందిపై హత్యాయత్నాలు జరిగాయన్నారు. 203 మంది చిన్నారులపై దాడులు, లైంగిక దాడులు జరిగాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై 2,466 కేసులు పెట్టారని, సోషల్ మీడియా కార్యకర్తలపై 729 అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. ఏడాది కాలంలోనే రూ.1.61 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. తమ ఐదేళ్ల పాలనలో చేసిన అప్పులో ఇది 48.5 శాతం అని గుర్తుచేశారు. రాష్ట్ర ఆదాయం పెరగకపోగా, 0.44 శాతం తగ్గిందని, ఆ సొమ్మంతా ఎవరి జేబుల్లోకి వెళ్తోందో చెప్పాలని నిలదీశారు. ఉద్దేశపూర్వకంగానే జగన్‌కు భద్రత తగ్గించి, ఆయన పర్యటనల్లో హింసను ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజాభిమానం ఉన్నంత వరకు ఎలాంటి కుట్రలు పన్నినా జగన్‌ను ఏమీ చేయలేరని కె.కె.రాజు స్పష్టం చేశారు.

హైవే జామ్

స్తంభించిన ప్రజా రవాణా ▪ ప్రయాణికులకు నరకయాతన





క్రికెట్ స్టేడియం వద్ద వాహనాల రద్దీ

ఎంవీపీకాలనీ: విశాఖపట్నం వేదికగా జరిగిన 'యోగాంధ్ర' కార్యక్రమం నగరవాసులకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రయాణికులకు తీవ్ర అవస్థలు మిగిల్చింది. కార్యక్రమం కోసం ప్రభుత్వం సుమారు 9,995 ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. శనివారం తెల్లవారుజాము నుంచే మద్దిలపాలెం, ఇసుకతోట, హనుమంతవాక, మధురవాడ, ఆనందపురం కూడళ్లలో జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. గ్రామీణ నియోజకవర్గాల నుంచి వచ్చిన వాహనాలను తగరపువలస, ఆనందపురం, మధురవాడ, ఎండాడ, జూపార్క్ కూడళ్ల మీదుగా బీచ్‌లోకి పంపించడంతో ఆయా కూడళ్లలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. దీంతో యోగా కార్యక్రమానికి వెళ్లేవారితో పాటు, సాధారణ ప్రజలు గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యోగాంధ్రకు వెళ్లే వారంతా ఆయా ప్రాంతాల్లోని జాతీయ రహదారులపై దిగి బీచ్‌రోడ్డుకు నడుచుకుంటూ వెళ్లాల్సివచ్చింది. ఇక విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సులు లేక, ప్రైవేటు వాహనాలు దొరక్క ద్వారకా, మద్దిలపాలెం బస్‌స్టేషన్ల వద్ద గంటల తరబడి పడిగాపులు కాశారు. ఇదే అదనుగా కొన్ని ఆటోలు, ప్రైవేటు వాహనాలు ప్రయాణికుల నుంచి అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేసి వారిని మరింత ఇబ్బందికి గురిచేశాయి. మొత్తం మీద యోగాంధ్ర కార్యక్రమం నగరంలో ట్రాఫిక్ గందరగోళాన్ని, ప్రయాణికులకు నరకయాతనను మిగిల్చింది.

కారాగారంలో వినూత్న యోగా



ఆరిలోవ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖ కేంద్ర కారాగారంలో అధికారులు వినూత్నంగా నిర్వహించారు. జైలు లోపల 1000 మంది ఖైదీలతో కలిసి అధికారులు, సిబ్బంది నల్ల రంగు ప్యాంట్‌లు, పలు రంగుల టీషర్టులు ధరించి యోగాసనాలు వేశారు. రంగురంగుల యోగా మ్యాట్‌లపై భారతదేశం మ్యాప్ ఆకారంలో నిలబడి యోగా చేస్తూ స్వదేశంపై ఉన్న అభిమానం చాటుకున్నారు. దీంతో పాటు జైల్ ప్రధాన ద్వారం బయట గాంధీ విగ్రహం వద్ద సిబ్బందితో కలిసి అధికారులు వృత్తాకారంలో నిలబడి యోగాసనాలు వేశారు. క్రమశిక్షణతో యోగాసనాలు వేసిన ఖైదీలు, సిబ్బందిని జైల్ పర్యవేక్షణాధికారి ఎం.మహేష్‌బాబు అభినందించారు.

తిట్టిన తిట్లకు తలెత్తుకోలేకపోతున్నాను

- పగోళ్లకు కూడా ఈ ఆర్పీ ఉద్యోగం రాకూడదు
- వాట్సాప్ గ్రూప్‌లో ఆర్పీ ఆవేదన

విశాఖ సిటీ: యోగాంధ్ర కార్యక్రమంలో తీసుకువెళ్లిన డ్వాక్రా మహిళలకు నీళ్లు కూడా ఇవ్వకపోవడంతో వారు తిట్టిన తిట్లకు కుమిలిపోతూ, కన్నీరు పెట్టుకుంటూ ఒక ఆర్పీ మాట్లాడిన మాటల ఆడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. సదరు ఆర్పీ తన ఆవేదనను వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న ఉన్నతాధికారులకు తెలియజేస్తూ పంపించిన ఆడియో మెసేజ్ లీక్ అయింది. అందులో ఆమె ప్రస్తావించిన విషయాలివి.. 'గ్రూప్‌లో ఉన్న ఏపీడీ, సీవోలకు, ఆర్పీలకు నమస్కారం. 'ఇలాంటి మీటింగ్ నా జీవితంలో చూడలేదు. జనాలు దారుణంగా తిడుతున్నారు. ఆర్పీల మీద ఉన్న మంచి పేరు పోయింది' అని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తాము జనాలను పోగేస్తే, సచివాలయ సిబ్బంది వారితో ఫొటోలు దిగి తమ ఉద్యోగాలను మెరుగుపరుచుకున్నారని విమర్శించారు. 'మా పరువు రోడ్డున పడింది. ఇలాంటి ఉద్యోగాలు పగోళ్లకు కూడా రాకూడదు' అని తీవ్ర నిరాశతో మాట్లాడారు. నాకు ఈ ఉద్యోగం చేయాలని లేదు. ఇలాంటి పరిస్థితి పగోళ్లకు కూడా రాకూడదు అంటూ ఆమె మాటలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.


ఆరోగ్యవంతమైన సమాజంతో సుస్థిర అభివృద్ధి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా



యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు

విశాఖ లీగల్: ఆరోగ్యవంతమైన సమాజంతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ, విశాఖ న్యాయవాదుల సంఘం సంయుక్తంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక శ్రమ, యోగ ధ్యానం తప్పనిసరి అని తెలిపారు. విశాఖలో తొలిసారిగా అత్యంత ప్రతిష్టాత్మకంగా యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినందుకు పలువురిని అభినందించి, భారత ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



విశాఖ అభివృద్ధి నా బాధ్యత

- మెట్రో, ఫ్లైఓవర్ ప్రాజెక్టులు వేగవంతం చేస్తా..
- పాతనగరం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి
- జీవీఎంసీ నూతన కమిషనర్ కేతన్ గార్గ్



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: విశాఖ నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, నగరాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని జీవీఎంసీ నూతన కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'నగరంలో పారిశుధ్యం, సుందరీకరణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తా. పౌరులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పిస్తా. తాగునీరు, వీధి దీపాలు, కాలువలు, రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి జీవీఎంసీకి అందే నిధులను సక్రమంగా వినియోగించి, విశాఖను మరింత అభివృద్ధి చేస్తా. ఇందుకోసం మేయర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకుంటా. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖకు ఉత్తమ ర్యాంకు సాధించేందుకు అందరి సహకారంతో కృషి చేస్తా. డీపీఆర్ ప్రకారం ప్రతిపాదించిన మెట్రో, ఫ్లైఓవర్ ప్రాజెక్టులకు జీవీఎంసీ తరఫున పూర్తి సహకారం అందిస్తా. ఆ పనులు వేగవంతమయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటా..' అని చెప్పారు. నగరంలోని ఖాళీ స్థలాలను సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తానని నూతన కమిషనర్ తెలిపారు. పార్కులు, కూడళ్లను అభివృద్ధి చేస్తానని చెప్పారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన కాలువల్లోని పూడికను తొలగిస్తామన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులపై సర్వే నిర్వహించి, ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. దక్షిణ నియోజకవర్గం పాతనగరంలో సమస్యలున్నాయని, వాటిని ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రోడ్ల అభివృద్ధిపై సర్వే నిర్వహించి, అడ్డంకులుంటే న్యాయపరంగా వాటిని పరిష్కరిస్తామని, బిల్డింగ్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. నగరంలోని సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను పోలీస్ శాఖ, జీవీఎంసీ సమన్వయంతో నిర్వహిస్తామన్నారు. తీర నగరమైన విశాఖను ఇతర నగరాలతో 'సిస్టర్ సిటీ'లుగా అనుసంధానించేందుకు ప్రయత్నిస్తామని, నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని కేతన్ గార్గ్ పేర్కొన్నారు.

అడుగడుగునా అవస్థలు



ఫుట్‌పాత్‌లపైనే పోలీసుల నిద్ర



అర్ధరాత్రి రోడ్డుమీదే పడుకున్న విద్యార్థినులు



యోగా మ్యాట్ లేదు.. గ్రీన్ మ్యాటూ లేదు..

తగరపువలస/కొమ్మాది/మధురవాడ: ఏక కాలంలో లక్షల మందితో యోగాసనాలు వేయించి ప్రపంచ రికార్డు సృష్టించాలనే లక్ష్యంతో చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమం ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది. సరైన నిర్వహణ లేకపోవడంతో పాల్గొన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యోగాంధ్ర నిర్వాహకుల వైఫల్యం కారణంగా కనీసం తాగునీరు కూడా అందక జనం అల్లాడిపోయారు. పండ్ల కోసం కొట్టుకునే పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా పలువురు తన ఆవేదనను వెళ్లగక్కారు.

ప్రభుత్వానికి ఖర్చు.. మాకు సమయం వృథా



విశాఖ బీచ్‌లోనే యోగాసనాలు వేయాలనుకోవడం వ్యయప్రయాస తప్ప మరొకటి కాదు. శుక్రవారం రాత్రి 8 గంటలకు శ్రీకాకుళంలో బయలుదేరి నిద్ర లేకుండా డొక్కు బస్సుల్లో శనివారం ఉదయం ఇక్కడకు చేరుకున్నాం. ప్రభుత్వానికి వృథా ఖర్చు, మాకు సమయం వృథా. ఇక్కడకు వచ్చి మేము చేసింది ఏమీ లేదు. సరదాగా వచ్చినట్టయింది.

–పెంట మధు, బూర్జ, శ్రీకాకుళం

ఇబ్బందులు పడ్డాం



విజయనగరం నుంచి తెల్లవారుజామున వచ్చేశాం. బీచ్‌రోడ్డులో మాకు ఓ స్థలం చూపించారు. అక్కడే ఉండమని చెప్పారు. అయితే దగ్గరలో మరుగుదొడ్లు లేకపోవడంతో మేమంతా చాలా ఇబ్బందులు పడ్డాం. చుట్టూ కర్రలతో కట్టివేయడంతో ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎందుకు వచ్చామా అనిపించింది. – లక్ష్మి, విజయనగరం

కిలోమీటర్ల దూరం నడవాల్సి వచ్చింది



మాది విజయనగరం. తెల్లవారుజామున మూడు గంటలకు బీచ్ రోడ్డుకు చేరుకున్నాం. అయితే ట్రాఫిక్ వల్ల 2 కిలో మీటర్ల దూరంలో మా బస్సు నిలిపివేశారు. చేసేదేమీ లేక అక్కడ నుంచి నడుచుకుని వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నాం. –రాంబాబు, విజయనగరం

తీసుకొచ్చిన వారు వదిలేశారు..



యోగాంధ్రకు రావాలని ఇంటింటికీ తిరిగి పట్టుబట్టినవారు.. ఇక్కడకు చేరిన తర్వాత పట్టించుకోలేదు. నాలుగు గంటల పాటు నిలబడి అలాగే వచ్చేశాం. మ్యాట్‌లు, ఫుడ్ ప్యాకెట్లు, టీ షర్టులు పంపిణీలో ప్రభుత్వం విఫలమైంది. ప్రణాళిక లేకుండా సాగితే ఇలాగే ఉంటుంది.

-కుంచం వెంకటరమణ, తగరపువలస

ఏమీ లేకుండా చేశారు



ఇక్కడకు వచ్చేసరికి టీ-షర్ట్‌లు లేవని చెప్పారు. ప్రతి ఒక్కరికి టీ-షర్ట్, యోగా మ్యాట్, అల్పాహారం అందిస్తామని ఇంటి వద్ద చెప్పారు. తీరా వచ్చిన తర్వాత ఏది ఇవ్వకుండా పంపించారు. కొందరు టీ-షర్ట్‌లను పక్కతోవ పట్టించారు. వలంటీర్లు కట్టలు కట్టి టీ-షర్ట్‌లను తీసుకెళ్లిపోయారు. – ధన, విశాఖపట్నం

రాత్రి ఇంటి వద్ద భోజనం చేసి వచ్చాం



రాత్రి ఇంటి వద్ద భోజనం చేసి వచ్చాం. బస్సులో తాగునీరు, బిస్కెట్ ప్యాకెట్ ఇచ్చారు. కొందరికి ఏర్పాట్లు చేశారు. మరికొందరికి ఎలాంటి వసతులు లేవు. యోగాంధ్ర కార్యక్రమం కారణంగా చాలా చోట్ల బస్సులు నిలిపివేశారు. ఇవే యోగాసనాలు మా గ్రామంలో కూడా వేసుకోవచ్చు.

-అంపోలు అప్పన్న, ఆముదాలవలస, శ్రీకాకుళం

మరుగుదొడ్లు లేవు



మేము అనకాపల్లి జిల్లా సీతానగరం నుంచి వచ్చాం. శుక్రవారమే బయలుదేరించారు. భోజనం, నిద్ర అంతంత మాత్రమే. ఇక్కడకు వేకువ జామునే వచ్చాం. కనీసం మరుగుదొడ్ల సదుపాయం లేక బాటిల్స్ పట్టుకుని తుప్పల్లోకి వెళ్లాం.

–ధర్మతేజ, విద్యార్థి, అనకాపల్లి జిల్లా

యోగాసనాలు వేయనేలేదు..



ఇక్కడ యోగా ఎలాగూ చేయించలేదు. కనీసం చూసే అవకాశం కూడా ఇవ్వలేదు. ఉదయం 4 గంటలకు గాజువాకలో బయలుదేరాం. ట్రాఫిక్‌తో ఇక్కడకి వచ్చేసరికే 8 అయిపోయింది. ఇన్ని కష్టాలు పడి ఇక్కడకు వస్తే ఒక్కరు కూడా పట్టించుకోలేదు. –ప్రియాంక, అగనంపూడి

కాంట్రాక్టర్ వైఫల్యం



చేపలుప్పాడ వద్ద తొక్కిసలాటలు, తోపులాటల్లో కాంట్రాక్టర్ వైఫల్యం స్పష్టంగా కనిపించింది. 2 వేలకు పైగా మందిని తాత్కాలిక కంపార్ట్‌మెంట్‌లోకి తోసేశారు. కనీసం రెండో స్క్రీన్ కూడా ఏర్పాటు చేయలేదు. జీవీఎంసీ అధికారులకు చెప్పినా వసతులు సమకూర్చలేదు.

– దోని నాగరాజు, బీజేపీ జిల్లా యూత్ అధ్యక్షుడు

పూరీ రథయాత్ర కోసం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పూరీలో జగన్నాథ రథయాత్రకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-పూరీ(08313) స్పెషల్ రైళ్లు ఈ నెల 27, జూలై 5న రాత్రి 12.45 గంటలకు విశాఖలో బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు పూరీ చేరుకుంటాయి. పూరీ-విశాఖ (08314) స్పెషల్ రైళ్లు ఈ నెల 28, జూలై 6 తెల్లవారు 2.15 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 1 గంటకు విశాఖ చేరుకుంటాయి.

సిల్చార్ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం.. పలు రైళ్ల ఆలస్యం

తాటిచెట్లపాలెం: సిల్చార్-త్రివేండ్రం (12508) ఎక్స్‌ప్రెస్‌లో శనివారం రాత్రి సాంకేతిక లోపం తలెత్తింది. రైలు రాత్రి 7 గంటల తర్వాత విశాఖ చేరుకుని, బయలుదేరిన కొద్దిసేపటికే సెకండ్ ఏసీ కోచ్‌లో సమస్య కారణంగా ప్రయాణికులు చైన్ లాగి ఆపేశారు. రైల్వే అధికారులు రైలును వెనక్కి తీసుకువచ్చి మరమ్మతులు చేపట్టారు. దీంతో రైలు సుమారు 4 గంటలు ఆలస్యమై, రాత్రి 11 గంటల తర్వాత బయలుదేరింది. ఈ కారణంగా కోరమండల్, కోణార్క్, మచిలీపట్నం, ఈస్ట్‌కోస్ట్, ఫలక్‌నుమా, ఏపీ ఎక్స్‌ప్రెస్ వంటి పలు రైళ్లు 2 నుంచి 3 గంటలు ఆలస్యంగా నడిచాయి. కొన్ని రైళ్లను గోపాలపట్నం, సింహాచలం, విజయనగరం స్టేషన్లలో నిలిపివేశారు.